సాక్షి
రంగారెడ్డి
శనివారం । 15 । జూన్ । 2024



మూసివేయాలి

గుర్తింపు లేని విద్యా సంస్థలను మూసివేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. 8లో▸



విద్యావంతులకే గుర్తింపు

దేశ భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸



అక్రమాలకు నోటీసులు

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తుర్కయంజాల్ ఇన్‌చార్జి కమిషనర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. 8లో▸

న్యూస్‌రీల్

విద్యతోనే గుర్తింపు

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



డ్రా తీస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రజ్ఞ హైస్కూల్, ఆమనగల్లు, ఫాతిమా హైస్కూల్ కొత్తూరులో 3,5,8వ తరగతుల్లో గిరిజన బాలురు, బాలికల ఎంపిక కోసం లక్కీ డ్రా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదివి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మూడో తరగతిలో 45 సీట్లు ఉండగా 39 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఐదో తరగతిలో 22 సీట్లుకు గాను 58 మంది దరఖాస్తు చేసుకున్నారని, 8వ తరగతిలో 22 సీట్లకు గాను 137 మంది దరఖాస్తు చేసుకున్నట్టు వెల్లడించారు. వీరిలో 44 మందిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రామేశ్వరి దేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో టెండర్లకు ఆహ్వానం

చేవెళ్ల: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఫుడ్ క్యాటరింగ్ సరుకులు, బార్బర్లకోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు నవాబుపేట బీసీ(బాలుర) గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రావు అన్నారు. చేవెళ్లలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల మండలం గొల్లపల్లి సమీపంలోని బండారి శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న నవాబుపేట బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం 2024–25కుగాను టెండర్లు అహ్వానిస్తున్నట్లు చెప్పారు. గురుకులానికి కిరాణా సరకులు, కూరగాయులు, పండ్లు, గుడ్లు, చికెన్, మటన్, క్యాటరింగ్, బార్బర్‌ల కోసం టెండర్లు పిలుస్తున్నట్లు చెప్పారు. అసక్తిగల వారు బ్యాంక్‌లో డీడీలు తీసుకొని టెండర్ ఫారాలు పొందాల్సి ఉంటుందన్నారు. కిరాణా సరుకులకోసం రూ.2వేల డీడీని, కూరగాయలు, పండ్లు, గుడ్ల, చికెన్, మటన్, క్యాటరింగ్ కోసం రూ.1000, బార్బర్ కోసం రూ.500 డీడీని ప్రిన్సిపాల్ ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్(బాయ్స్) గొల్లపల్లి పేరు మీద తీయాలన్నారు. డీడీని తీసుకువచ్చి టెంటర్ ఫారాలను తీసుకోవాలన్నారు. టెండర్‌ఫారాలు దాఖలు చేయడానికి ఈనెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందని వివరించారు. టెండర్లను 24న వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సమక్షంలో తెరువనున్నట్టు తెలిపారు. వివరాలకు 79896 49926 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రక్తదాతకు సన్మానం



మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న మనోరమ్మ

తలకొండపల్లి: అత్యధికంగా రక్తదానం చేసి, అనేక రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలతో స్వచ్ఛందంగా రక్తదానం చేయించిన రామకృష్ణాపురం గ్రామానికి చెందిన మనోరమ్మను మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. అంతర్జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ రాజ్‌భవన్ రోడ్డులో ఉన్న సంస్కృతి నిలయంలో రక్తదాతలకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మనోరమ్మను అభినందించి సన్మానించారు. ప్రశంసా పత్రం, మెమొంటోను బహూకరించారు. మనోరమ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

శంకర్‌పల్లి: వాహన తనిఖీల్లో భాగంగా బైక్‌పై ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న సంఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకి చెందిన బాబు హల్దర్ (40), సుఖచంద పోదర్ (35) శుక్రవారం నార్సింగి నుంచి బైక్ మీద సంచిలో ఎండు గంజాయిని హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు కొల్లూరు వద్ద వాహన తనిఖీ చేస్తూ వీరిని పట్టుకున్నారు. గంజాయి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని, నిందితుల నుంచి సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పొట్టేళ్ల జోరు

బక్రీద్ వేళ భారీగా విక్రయాలు

- సైజును బట్టి రేటు నిర్ణయిస్తున్న వ్యాపారులు
- కొనుగోళ్లతో జల్‌పల్లి పరిధిలో సందడి





జల్‌పల్లి కార్గో రోడ్డులో కొనసాగుతున్న పొట్టేళ్ల క్రయవిక్రయాలు

పహాడీషరీఫ్: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని గొర్రె పొట్టేళ్ల విక్రయాలు ఊపందుకున్నాయి. మూడు రోజుల ముందు నుంచే జల్‌పల్లి మున్సిపాలిటీకి పొట్టేళ్లు పెద్ద ఎత్తున దిగుమతి అయ్యాయి. ఒకప్పుడు జియాగూడ, పాతబస్తీకి వెళ్లి కొనుగోలు చేస్తుండగా పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉండడంతో వ్యాపారులు ప్రస్తుతం ఇక్కడే విక్రయాలు ప్రారంభించారు. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పొట్టేళ్లను తీసుకొచ్చిన వ్యాపారులు జల్‌పల్లి కార్గో రోడ్డులో విక్రయాలు చేపట్టారు. వాంబే కాలనీ నుంచి మొదలుకొని మంచుటౌన్ షిప్ చౌరస్తా వరకు విశాలమైన రోడ్డు డివైడర్‌పై విక్రయాలు కొనసాగిస్తున్నారు. పాతబస్తీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలంతా ఇక్కడికే వచ్చి కొనుగోళ్లు చేయడంలో నిమగ్నమయ్యారు. వేల సంఖ్యలో మూగజీవాల క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి.

భారీగా ధరలు

బక్రీద్ పండుగను పురస్కరించుకొని గొర్రె పొటేళ్ల ధరలు ఈసారి బాగానే పలుకుతున్నాయి. చిన్న చిన్న పొట్టేళ్ల ధరలు సైతం రూ.8 వేల నుంచి పలుకుతున్నాయి. ఇక పెద్ద పొట్టేళ్లు ఏకంగా ఒక్కోటి రూ.20 వేల నుంచి రూ.30 వేలుగా నిర్ణయించి విక్రయిస్తున్నారు. జల్‌పల్లి కార్గో రోడ్డు, ఎర్రకుంట, షాహిన్‌నగర్, పహాడీషరీఫ్, ఆర్‌సీఐ రోడ్డులలో వీటి విక్రయాలు ప్రధానంగా కొనసాగుతున్నాయి. తమ బిడ్డకు సమానంగా నిండు ఆరోగ్యం (కొమ్ములు, చెవులు సక్రమంగా ఉండడం)గా ఉన్న జీవాన్ని ఖుర్బానీకి ఇచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అలాంటి వాటికి ఎంత ధర పెట్టేందుకైనా వెనుకాడడం లేదు.

ఈద్గాల వద్ద ఏర్పాట్లు

బక్రీద్‌ను పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని వాదే ముస్తఫా, వాదే హదీస్, పహాడీషరీఫ్, కొత్తపేట ఈద్గాల వద్ద ముస్లింలు పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆయా ఈద్గాల పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించి చదును చేపడుతున్నారు. షాహిన్‌నగర్, సాదత్‌నగర్ మర్కజీలలో కూడా ప్రార్థనలను పురస్కరించుకొని పహాడీషరీఫ్, బాలాపూర్ పోలీసులు బందోబస్తు ప్రక్రియపై కూడా దృష్టి సారించారు.

కవర్లలోనే వ్యర్థాలు వేయాలి



బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ అనంతరం జంతు వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా మున్సిపాలిటీ తరపున పెద్ద పెద్ద కవర్లను పంపిణీ చేస్తున్నాం. బస్తీల్లోని వ్యర్థాలను తరలించడానికి మున్సిపాలిటీకి చెందిన ఆటోలు, టిప్పర్లు, ట్రాక్టర్లతో సిద్ధంగా ఉన్నాం. అన్ని వార్డుల్లో మూడేసి చొప్పున పాయింట్లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలంతా మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించి స్వచ్ఛ జల్‌పల్లికి పాటుపడాలి.

– అల్లూరి వాణిరెడ్డి, కమిషనర్, జల్‌పల్లి మున్సిపాలిటీ

నిబంధనలకు అనుగుణంగా..



రోడ్లపై వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఖుర్బానీ జంతువులను విక్రయించుకోవాలి. ఈ విషయమై స్థానికంగా శాంతి కమిటీ సమావేశాలు ఏర్పాటు చేశాం. ముఖ్యంగా ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌కు ఇబ్బంది, స్థానిక వ్యాపారులకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలి. పశు వైద్యాధికారి ధ్రువీకరించిన సర్టిఫికెట్ కూడా ఉంచుకోవాలి. నిబంధనలకు అనుగుణంగా వాహనంలో అనుమతి ఉన్న జంతువులను గాలి వీచే విధంగా తీసుకెళ్లాలి.

– పి.లక్ష్మీకాంత రెడ్డి, ఏసీపీ, మహేశ్వరం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ధరణి దరఖాస్తులకు పరిష్కారం చూపాలి

అధికారులకు కలెక్టర్ శశాంక ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణిలో వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన దరఖాస్తులను తక్షణమే పరిశీలిస్తూ, యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా దరఖాస్తులకు సంబంధించి ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన వాటిని మూడు, నాలుగు రోజుల్లో పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేకుండా వారం వ్యవధిలో అన్నింటినీ పరిష్కరించాలని స్పష్టమైన గడువు విధించారు. అపరిష్కృతంగా ఉన్న ధరణి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. ఆర్డీఓ, తహసీల్దార్ లాగిన్లలోని పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ క్లియర్ చేయాలన్నారు. అలసత్వానికి ఏమాత్రం తావు లేకుండా, దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర భూపరిపాలనా విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్‌తో కలిసి సచి వాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధరణి పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణిలో భూసంబంధిత అంశాలపై దరఖాస్తుదారులు సమర్పించిన అర్జీలపై చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజా భవన్‌లో రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన అర్జీలను కూడా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీలపై చేపట్టిన చర్యల గురించి దరఖాస్తుదారునికి వివరాలు తెలియజేయడంతో పాటు, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. అర్జీలపై తక్షణమే స్పందిస్తూ, సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజావాణి కార్యక్రమంపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంపొందింపజేయాలని తెలిపారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం చేపడుతున్న చర్యలకు సంబంధించి రోజువారీగా తనకు నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, ఆర్డీఓలు సాయిరాం, అనంత్ రెడ్డి, సూరజ్ కుమార్, వెంకట్ రెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

గురుకులాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ తనిఖీ



వంట సరుకులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

కందుకూరు: మండలంలోని బైరాగిగూడ పరిధిలోని మహాత్మా జ్యోతిరావుపూలే, గూడూరు గేట్ వద్ద నున్న సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలను శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వసతులను గురించి ఆరా తీశారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు ఉన్నారా? లేరా? అని అడిగి తెలుసుకున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుపాఠశాలలోని భోజనశాల, వంట గది అపరిశుభ్రంగా ఉండటాన్ని చూసి ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా వసతులు కల్పించాలని, పరిశుభ్రత విషయంలో రాజీ పడొద్దన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు తప్పనిసరిగా ప్రతి రోజు శానిటేషన్ చేయించాలన్నారు. అనంతరం ఎస్సీ గురుకులాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ జి.శమంత, ఎంపీడీఓ సరిత, ఎంఈఓ మనోహర్, నాయకులు సరికొండ మల్లేష్, వి.శ్రీను, ఎస్.పాండు, జి.సుధాకర్‌రెడ్డి, ఎస్.వీరారెడ్డి, ఎస్.జగన్ తదితరులు ఉన్నారు.

కత్తితో పొడిచి స్నేహితుడి హత్య

- వివాహేతర సంబంధం వద్దన్నందుకు..
- బాలాపూర్ పీఎస్ పరిధిలో ఘటన



మృతుడు సయ్యద్ సమీర్(ఫైల్)

పహాడీషరీఫ్: ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట హాఫీజ్‌బాబానగర్‌కు చెందిన సయ్యద్ మునీర్ కుమారుడు సయ్యద్ సమీర్(19), సోహెల్, సోఫియన్ స్నేహితులు. వీరిలో ఒకరైన సోహెల్ ఇదే కాలనీలలో ఉండే ఓ వివాహితతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సమీర్.. అందరం ఒకే కాలనీలో ఉంటున్నాం.. నాకు కూడా అక్కాచెల్లెళ్లు ఉన్నారు.. ఇలా చేయడం తప్పు అని సోహెల్‌కు సూచించాడు. ఇది జీర్ణించుకోలేని అతను సమీర్ తనపై దుష్ప్రచారం చేస్తున్నాడని భావించాడు. ఎలాగైనా అతన్ని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగానే గురువారం రాత్రి తన మరో స్నేహితుడు సోఫియన్‌తో కలిసి ముందస్తు పథకంలో భాగంగా.. సమీర్‌ను తీసుకుని బాలాపూర్ ఠాణా పరిధిలోని గుర్రం చెరువు ప్రాంతానికి వెళ్లారు. అనంతరం వెంట తెచ్చుకున్న పదునైన కత్తితో సోహెల్ దాడికి పాల్పడ్డాడు. సమీర్ ఛాతి, వీపు భాగాల్లో ఐదుసార్లు బలంగా పొడిచాడు. ఈ సమయంలో విరిగిపోయిన కత్తి మృతుడి కడుపులోనే ఉండిపోవడం గమనార్హం. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

సలహా కేంద్రాలతో సత్వర న్యాయం

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

ఆమనగల్లు: రైతుల న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రైతు న్యాయ సలహాకేంద్రం ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని రైతువేదిక భవనంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యవసాయ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు రైతు న్యాయ సలహా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వ్యవసాయ, న్యాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా పనిచేసి రైతులకు న్యాయం జరిగేలా చూడడమే వీటి ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రైతులు తమ భూ వివాదాలు, ఇతర న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పారాలీగల్ వలంటీర్లను నియమించినట్లు వెల్లడించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులతో నష్టపోతే న్యాయసలహా కేంద్రంలో ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. సదస్సులో జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి, ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, ఏడీఏ సుజాత, ఎంపీడీఓ శ్రీకాంత్, వ్యవసాయాధికారి అరుణకుమారి, ఎంపీఓ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ వసంత, డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా సర్కారు విద్య

- జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు



బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్ రావు

మహేశ్వరం: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవంతో కూడిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాం, మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేస్తుందన్నారు. కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందిస్తున్నామని తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవద్దని సూచించారు. విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తే అద్భుత విజయాలు సృష్టించవచ్చని తెలిపారు. అంతకు ముందు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునీతా నాయక్, ఎంఈఓ కృష్ణ, ఎంపీడీఓ శైలజ, మండల నోడల్ అధికారి కస్నా నాయక్, ఎంపీటీసీ పి.సుదర్శన్ యాదవ్, ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్ కార్పొరేటర్‌కు రిమాండ్

- రియల్ ఎస్టేట్ పేరుతో రూ.5 కోట్లకు టోకరా
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



మీర్‌పేట కార్పొరేటర్ నరేంద్రకుమార్

మీర్‌పేట: తప్పుడు పత్రాలు సృష్టించడంతో పాటు పొలం రిజిస్ట్రేషన్ చేయిస్తానని డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడిన మీర్‌పేట కార్పొరేటర్‌ను పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ కథనం ప్రకారం.. మీర్‌పేట 13వ డివిజన్ కార్పొరేటర్ మొక్క నరేంద్రకుమార్ (నందు) రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని.. తనకు పరిచయస్తుడైన చంపాపేట వాసి చిత్తోజు కృష్ణను నమ్మించాడు. ఈ క్రమంలో అతని నుంచి రూ.5 కోట్లు తీసుకుని కొంగరకలాన్‌లోని సర్వే నంబర్ 76అ, 74ఆ, 76ఆ, 75ఆ, 74ఇ, 74అ, 75ఇ, 75అలోని 6 ఎకరాల 17 గుంటల భూమిని.. సంబంధిత యజమానులు తుమ్మల ధీరజ్‌రెడ్డి, తోట మాధవరెడ్డి, గుండు శ్రీకాంత్ కలిసి.. కొనుగోలుదారులైన చిత్తోజు కృష్ణ, బొడ్డుపల్లి సతీష్‌కుమార్, మొక్క నరేంద్రకుమార్‌లకు విక్రయిస్తున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించాడు. అనంతరం భూములు రిజిస్ట్రేషన్ చేయించాలని కృష్ణ అడగగా వాయిదా వేస్తూ వచ్చాడు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు నేరుగా యజమానుల వద్దకు వెళ్లి ఆరా తీయగా తామెవరికీ పొలాలు అమ్మలేదని చెప్పడంతో కంగుతిన్నాడు. మోసపోయినట్లు గుర్తించి.. నందుపై మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు కార్పొరేటర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్త

- జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



మంచాల పీఏసీఎస్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న గీతారెడ్డి

మంచాల: విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు లూజుగా అమ్మే విత్తనాలను కొనుగోలు చేయొద్దని, లైసెన్స్ పొందిన డీలర్ల నుంచి మాత్రమే కొనాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేస్తున్నప్పుడు ప్యాకెట్‌పై బ్యాచ్ నంబర్, లాట్ నంబర్, కంపెనీ పేరు, విత్తనం ప్యాకింగ్ తేదీ, గడువు ముగింపు తేదీ వంటి వివరాలు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకెట్లు, రశీదులు పంట కోసే వరకు జాగ్రత్తగా దాచి పెట్టుకోవాలన్నారు. ఎవరైనా లూజు విత్తనాలు అమ్ముతుంటే వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తేవాలన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు లైసెన్స్ పొందిన దుకాణాల వద్ద అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని మూడు విత్తనాల విక్రయ దుకాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జ్యోతిశ్రీ, ఏఈఓ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు నోటీసులు



ఓ రిసార్ట్‌కు నోటీసులు ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుర్కయంజాల్: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ బి.చంద్రశేఖర్ హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అనుమతులు లేకుండా, నిబంధనలను పాటించకుండా చేపడుతున్న నిర్మాణాలకు శుక్రవారం మున్సిపల్ సిబ్బంది నోటీసులు అందజేశారు. నిబంధనలు పాటించకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డబ్బుల కోసం మేనమామ హత్య

- స్నేహితులతో వచ్చి కత్తితో దాడి
- తంగడపల్లిలో ఘటన



రుల్లాఖాన్ (ఫైల్)

చేవెళ్ల: డబ్బుల కోసం మేనమామను అల్లుడు హత్య చేసి పరారైన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తంగడపల్లిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రుల్లాఖాన్(58) భార్యాపిల్లలతో కలిసి నగరంలో నివాసం ఉండేవారు. ఆరోగ్యం బాగలేకపోవటంతో రెండేళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చారు. స్థానికంగా ఉంటూ మామిడి తోటలను లీజుకు తీసుకొని జీవనం సాగిస్తున్నాడు. నగరంలో ఉండే మేనల్లుడు (అక్కకొడుకు) ఖాజాపాషా అప్పుడప్పుడూ ఇక్కడకు వెళ్తుండేవాడు. డబ్బులు కావాలని పలుమార్లు రుల్లాఖాన్‌ను అడిగాడు. దీనికి ఆయన నిరాకరిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఖాజాపాషా తన స్నేహితులైన షేక్ ముస్తఫా, అఫ్జల్‌ను వెంట తీసుకొని బైక్, స్కూటీపై వచ్చారు. రాత్రి వరకూ రుల్లాఖాన్‌తో కలిసి ఇంట్లోనే ఉన్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత డబ్బుల విషయంలో గొడవ జరగడంతో ఖాజాపాషా తన వెంట తెచ్చుకున్న కత్తితో మామను పొడిచి హత్య చేశాడు. అనంతరం స్నేహితులతో కలిసి పారిపోయేందుకు బయట ఉన్న స్కూటీని తీస్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తులుగా భావించిన స్థానికులు వారిని వెంబడించారు. దీంతో స్కూటీని అక్కడే వదిలేసి బైక్‌పై పారిపోయారు. ఉదయం రుల్లాఖాన్ హత్య విషయం వెలుగు చూడటంతో.. రాత్రి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులపై అనుమానం వ్యక్తంచేస్తూ స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చుట్టు పక్కల వారు రుల్లాఖాన్ వద్దకు మేనల్లుడు ఖాజాపాషా అతని స్నేహితులు వచ్చినట్లు చెప్పారు. స్కూటీ కూడా వారిదేనని చెప్పటంతో.. ఆధారాలను సేకరించి పోలీసులు.. ఖాజాపాషానే హత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రుల్లాఖాన్‌కు ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉన్నారు.

ప్రాణం తీసిన పందెం

- స్నేహితుల చాలెంజ్‌తో పురుగు మందు తాగిన వ్యక్తి
- చికిత్స పొందుతూ ఉస్మానియాలో మృతి



సురేందర్ (ఫైల్)

శంకర్‌పల్లి: స్నేహితుల సరదా మాటలు, పందేలు ఓ నిండు ప్రాణాన్ని కబళించాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని చెందిప్పకు చెందిన సురేందర్(45) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈనెల 1న గ్రామానికి చెందిన ఇద్దరు స్నేహితులతో కలిసి సురేందర్ బయటకు వెళ్లాడు. సరదా సరదాగా మాట్లాడుకున్న స్నేహితులు పురుగు మందు తాగితే రూ.లక్ష ఇస్తామని సురేందర్‌తో పందెం కాసారు. దీంతో అతడు నిజంగానే మందు తాగడంతో.. టెన్షన్‌కు గురైన మిత్రులు, తెలిసిన వాళ్లు విరుగుళ్లు ఇచ్చి వాంతులు చేయించారు. అంతా బాగుందని ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. మరుసటి రోజు నుంచి సురేందర్ ఆరోగ్యం క్షీణిస్తుండటంతో ఈనెల 4న సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా మారడంతో 5న ఉస్మానియాకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



రాజు (ఫైల్)

కడ్తాల్: యువకుడు అదృశ్యమైన సంఘటన శుక్రవారం కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మూడేళ్ల క్రితం హయత్‌నగర్‌కు చెందిన తరండ్ల మీనా, నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం అజిలాపూర్ గ్రామానికి చెందిన కేశమోని రాజు(23) ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం బతుకు దెరువుకు భార్యాభర్తలిద్దరూ మండల కేంద్రంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని, కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 9న రాత్రి మీనా సరుకులు తీసుకురావడానికి దుకాణానికి వెళ్లింది. షాపు నుంచి తిరిగి ఇంటికి వచ్చేసరికే రాజు ఎక్కడికో వెళ్లిపోయాడు. భర్త ఆచూకీ కోసం ఆమె చుట్టు పక్కల వెతికినా లభం లేదు. దీంతో మీనా శుక్రవారం కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

టెస్కాబ్ వైస్ చైర్మన్‌కు సత్కారం



సత్తయ్యను సన్మానించిన సహకార సంఘం సభ్యులు, సిబ్బంది

తుర్కయంజాల్: తెలంగాణ రాష్ట్ర కేంద్ర సహకార బ్యాంక్ (టెస్కాబ్) వైస్ చైర్మన్‌గా నియమితులైన కొత్తకుర్మ సత్తయ్యను శుక్రవారం సహకార సంఘం డైరక్టర్లు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. తుర్కయంజాల్ చైర్మన్ టెస్కాబ్‌కు ఎన్నిక కావడం గర్వించదగ్గ విషయమని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కొత్త రాంరెడ్డి, డైరక్టర్లు సంజీవరెడ్డి, నర్సింగ్‌రావు, లక్ష్మారెడ్డి, యాదగిరి, లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సెక్రటరీ రాందాసు, నాయకులు శ్రీనివాస్, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పాండు మృతదేహం

తలకొండపల్లి: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని తుమ్మల కుంట తండాలో చోటు చేసుకుంది. శుక్రవారం సీఐ ప్రమోద్ కుమార్ చెప్పిన వివరాల ప్రకారం.. తుమ్మకుంట తండాకు చెందిన మూడావత్ పాండు(45), శాంతి భార్యాభర్తలు. వీరికి శ్రీహరి అనే కుమారుడు ఉన్నాడు. ముగ్గురు గత కొంత కాలంగా కుటుంబ సమస్యలపై తరచుగా గొడవలు పడుతుండే వారు. బుధవారం రాత్రి మాట మాట పెరిగి ఆవేశానికి లోనయ్యారు. భార్య శాంతి, కుమారుడు శ్రీహరి ఇద్దరు కలిసి కట్టెలతో విచక్షణా రహితంగా పాండును కొట్టారు. దీంతో ఆయన సొమ్మసిల్లి పడి పోయాడు. మెరుగైన చికిత్స నిమిత్తం పాండును అదే రాత్రి హైదరాబాద్‌కు తరలించారు. ఉస్మానియాలో చికిత్స పొందుతూ పాండు గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ చెప్పారు.

15 రోజుల్లో 147 మంది పోకిరీల అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మహిళలను వేధిస్తున్న ఆకతాయిల ఆటకట్టించారు రాచకొండ షీ టీమ్ పోలీసులు. 15 రోజుల్లో 147 మంది పోకిరీలను అరెస్టు చేశారు. వీరందరికీ వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. పట్టుబడిన వారిలో 87 మంది మేజర్లు, 60 మంది మైనర్లు ఉన్నారని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టీ ఉషావిశ్వనాథ్ తెలిపారు. ఆయా ఫిర్యాదుల్లో 11 మంది పోకిరీలపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

విద్యావంతులకే సమాజంలో గుర్తింపు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు: దేశ భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా పలువురు చిన్నారులకు ఎమ్మెల్యే అక్షరాభ్యాసం చేయించడంతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఉపాధ్యాయులు తమ బోధనల ద్వారానే దేశానికి అవసరమైన న్యాయవాదులు, రాజకీయనాయకులు, వైద్యులు, శాస్త్రవేత్తలను తయారు చేస్తారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నిపుణులైన ఉపాధ్యాయులు ఉంటారని వివరించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుల్లో ఉన్నతంగా రాణించాలని కోరారు. భవిష్యత్‌లో చదువుకున్న వారికే అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, నాయకులు హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, ప్రభాకర్, సురేందర్, జనార్దన్‌చారి, శ్రీను, గోవింద్‌నాయక్, జగన్, నర్సింహ, ఎంఈవో కృష్ణారెడ్డి, ఎంపీడీవో అరుంధతి, పాఠశాల హెచ్‌ఎం అంగోర్‌నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రూ.75 కోట్ల భూమి కోటిన్నరకే తనఖా!

సాక్షి, సిటీబ్యూరో: రూ.75 కోట్ల విలువైన భూమిని కోటిన్నరకే తనఖా పెట్టారు ఇద్దరు ఘనాపాటీలు. సంఘం సభ్యులకు తెలియకుండా ఏకంగా ప్రధాన కార్యదర్శే పక్కా పథకం ప్రకారం అధ్యక్షుడికే స్థలాన్ని తాకట్టు పెట్టారు. ఈ మేరకు నమోదైన కేసులో సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్స్ వింగ్ (ఈఓడబ్ల్యూ) పోలీసులు ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బృందంగా ఏర్పడి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ ఎంప్లాయిస్ హౌసింగ్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్ఈఈహెచ్‌డబ్ల్యూఏ)ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంఘం సభ్యులు కలిసి సంగారెడ్డిలోని ఉస్మాన్‌నగర్ గ్రామంలో మూడెకరాల చొప్పున రెండుసార్లు మొత్తం ఆరు ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. కొంతకాలం తర్వాత దీని పక్కనే ఉన్న మరో ఐదెకరాల స్థలాన్ని కూడా కొన్నారు. ఈ ఐదెకరాల స్థలంలో 240 అపార్ట్‌మెంట్లు, 15 విల్లాలను నిర్మించి 2016లో సభ్యులకు అప్పగించారు. మిగిలిన 345 మంది సభ్యులు ఆరెకరాల స్థలంలో వాటాదారులుగా మిగిలిపోయారు.

◆ అయితే 2018 తర్వాత ఈ సొసైటీకి ఎన్నికలు జరగలేదు. జనరల్ బాడీ మీటింగూ నిర్వహించలేదు. దీన్ని ఎస్ఈఈహెచ్‌డబ్ల్యూఏ అధ్యక్షుడు జూబ్లీహిల్స్‌కు చెందిన గుజ్జారి అశోక్ రావు, ప్రధాన కార్యదర్శి గచ్చిబౌలికి చెందిన చావా ఉదయ్ కుమార్‌లు అవకాశంగా మలుచుకున్నారు. సంఘం సభ్యులకు తెలియకుండా, సొసైటీ అనుమతి లేకుండా మూడు ఎకరాల స్థలాన్ని ఉదయ్ కుమార్ అశోక్ రావుకు 2019 ఆగస్టు 21న తనఖా పెట్టాడు. ఈ ఏడాది ఏప్రిల్ 16న సభ్యుల్లో ఒకరు ఈ భూమికి సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) తీసుకున్నారు. దీంతో ఈ తాకట్టు విషయం వెలుగులోకి వచ్చింది. సొసైటీ సభ్యుల అనుమతి లేకుండా అక్రమంగా రూ.75 కోట్ల విలువైన ఆస్తిని కేవలం రూ.1.5 కోట్లకు తనఖా పెట్టడంపై సభ్యులు షాక్‌కు గురయ్యారు. దీంతో సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తగిన ఆధారాలతో ఇద్దరు నిందితులు అశోక్ రావు, ఉదయ్ కుమార్‌లను అరెస్టు చేశారు.

14వ అంతస్తు నుంచి దూకి మహిళ ఆత్మహత్య

రాజేంద్రనగర్: అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. నార్సింగి మై హోమ్ అవతార్ అపార్ట్‌మెంట్‌లో అనురాధ(35), జనార్దన్ రెడ్డిదంపతులు నివసిస్తున్నారు. అనురాధ హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుంది. శుక్రవారం భర్త ఉపాధ్యాయుడు కావడంతో విధులకు వెళ్లాడు. 14వ అంతస్తుకు వెళ్లిన అనురాధ అక్కడి నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని అపార్ట్‌మెంట్ వాసులు నార్సింగి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

నకిలీ పేటీఎంతో చీటింగ్ చేస్తున్న వ్యక్తి రిమాండ్

బంజారాహిల్స్: నకిలీ పేటీఎం యాప్‌తో డబ్బులు పంపినట్లు మెసేజ్ చూపించి అవతలి వారి నుంచి డబ్బులు తీసుకుని పరారవుతూ చీటింగ్‌కు పాల్పడుతున్న నిందితుడిని జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం... సైదాబాద్ సంతోష్‌నగర్‌కు చెందిన నర్రా సందీప్‌కుమార్ ఏటీఎంలు, పెట్రోల్ బంకులు, హోటల్స్ వద్ద సంచరిస్తూ అక్కడికి వచ్చేవారిని తనకు నగదు అవసరం ఉందని, మీకు పేటీఎంలో అమౌంట్ పంపిస్తానంటూ దీనంగా మొహం పెట్టి అర్థిస్తుంటాడు. ఇటీవలనే జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-45లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో క్యాష్ డిపాజిట్ మిషన్‌లో డబ్బులు డిపాజిట్ చేయదానికి వచ్చిన వ్యక్తి వద్దకు వెళ్లిన సందీప్‌కుమార్ తనకు డబ్బులు అవసరం ఉన్నాయని చెప్పి నమ్మించి ఒక నకిలీ పేటీఎం యాప్ ద్వారా డబ్బు పంపినట్లు మెసేజ్ చూపించి రూ. 35 వేలు తీసుకుని వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత తన ఖాతాలో డబ్బు జమ కాలేదని తెలుసుకున్న బాధితుడు రాజు తనను నకిలీ పేటీఎంతో మోసం చేసిన సందీప్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత రెండు రోజులకే పెట్రోల్ బంకు వద్ద శ్రీను అనే వ్యక్తి వద్ద ఇలాగే నకిలీ పేటీఎంతో మెసేజ్ పంపి రూ.12 వేలు తీసుకుని పరారయ్యాడు. ఫిర్యాదులను సవాల్‌గా తీసుకున్న జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. ఘటన జరిగిన ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. మొబైల్ ఫోన్ కాలేడేటా, టవర్ డంప్‌తో నిందితుడి ఆచూకీ తెలుసుకున్నారు. సందీప్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పెట్రోల్‌బంకులు, హోటళ్లు, ఏటీఎం సెంటర్ల వద్ద ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, తెలియని వ్యక్తులు వచ్చి డబ్బులు కావాలని కోరితే ఎవరూ ఇవ్వవద్దని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఐ మధుసూదన్ కోరారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తింపులేని విద్యా సంస్థలను మూసివేయాలి



డీఈఓ సుశీందర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: గుర్తింపు లేని విద్యా సంస్థలను మూసివేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, బి.శంకర్ మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయని అన్నారు. రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను కొల్లగొడుతున్నాయని ఆరోపించారు. విద్యను వ్యాపారంగా మార్చివేశారని, అంగట్లో సరుకులు అమ్మినట్లుగా అమ్మేస్తున్నారని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయించడం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యాపారాన్ని అడ్డుకోవాలని, ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తరంగ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.